సాక్షి కామారెడ్డి

సోమవారం । 3 । ఏప్రిల్ । 2023



రోడ్డు ప్రమాదాల్లో..

ఉమ్మడి నిజామాబాద్‌లో వేరువేరుచోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాలలో నలుగురు వ్యక్తులు మృత్యువాతపడ్డారు.

- 8లో ▸



దేశానికే ఆదర్శం

రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలు దేశానికి ఆదర్శమని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు.


- 9లో ▸



వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.7 /15.9

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.



న్యూస్‌రీల్

'పోచారం' నీటి విడుదల



నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టు నుంచి ఆదివారం నీటిపారుదలశాఖ అధికారులు ఐదోవిడత నీటి విడుదల చేపట్టారు. ప్రాజెక్టు నుంచి 231 క్యూసెక్కుల నీటిని ప్రధానకాలువలోకి విడుదల చేస్తున్నామని డీఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. యాసంగి పంటల సాగు పూర్తయ్యేంతవరకు నీటివిడుదల కొనసాగుతుందన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 0.539 టీఎంసీల నీరు నిల్వ ఉందని తెలిపారు.

10న జుక్కల్‌లో జోడో యాత్ర

సాక్షి, కామారెడ్డి: పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర ఈనెల 10న జిల్లాలో తిరిగి ప్రారంభం కానుంది. గతనెల 18, 19, 20 తేదీలలో జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ నియోజకవర్గాల్లో రేవంత్‌రెడ్డి జోడో యాత్ర చేశారు. అదే నెలలో జుక్కల్ నియోజకవర్గంలో జరగాల్సిన యాత్ర వాయిదా పడింది. మార్చి 20 న బాన్సువాడలో కార్నర్ మీటింగ్ ముగిసిన అనంతరం ఆయన హైదరాబాద్‌కు వెళ్లిరు. జుక్కల్ నియోజకవర్గంలో వాయిదా పడిన జోడో యాత్రను ఈనెల 10న కొనసాగించాలని నిర్ణయించినట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. 10వ తేదీన జుక్కల్‌లో రేవంత్ రెడ్డి హాథ్ సే హాథ్ జోడో యాత్ర చేస్తారని, అదే రోజు యాత్ర సంగారెడ్డి జిల్లాలోకి ప్రవేశిస్తుందని వివరించారు.

12నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు



తాడ్వాయి: మండల కేంద్రంలో ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బంగ్లా చైతన్య గౌడ్ తెలిపారు. ఆదివారం ఆయన తాడ్వాయిలో విలేకరులతో మాట్లాడారు. మహాత్మా జ్యోతీబా పూలే, అంబేడ్కర్ జయంతుల సందర్భంగా జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విజేతకు రూ. 50 వేలు, రెండో స్థానంలో నిలిచే జట్టుకు రూ. 25 వేలు, తృతీయ స్థానంలో నిలిచే జట్టుకు రూ. 10 వేలు, బెస్ట్ రైడర్, డిఫెండర్‌లకు రూ. 5 వేల చొప్పున నగదు అందిస్తామన్నారు. ఆసక్తి గల జట్లు 8వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు 80963 53545, 90003 26278 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీ ప్రయాణికులపై టోల్ భారం

ఖలీల్‌వాడి: టోల్‌చార్జీలను 5 శాతం పెంచడంతో ఆ భారాన్ని ఆర్టీసీ ప్రయాణికులపై మోపింది. మార్చి 31 అర్ధరాత్రి నుంచి టోల్ చార్జీలు పెంచిన విషయం తెలిసిందే. దీంతో టోల్‌ప్లాజాలు ఉన్న మార్గాల్లో ఆర్టీసీపై టికెట్‌పై రూ.10 పెంచింది. ఉమ్మడి జిల్లాలో ఇందల్వాయి, భిక్కనూర్ వద్ద టోల్‌ప్లాజాలు ఉన్నాయి. నిర్మల్ జిల్లా సోన్ వద్ద టోల్‌గేట్ ఉంది. ఆర్టీసీ చార్జీలు పెంచడంతో కామారెడ్డి నుంచి నిజామాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ బస్ చార్జీ రూ.100 నుంచి రూ.110 కు చేరింది.

విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సహాయం

బాన్సువాడ: బీర్కూర్ బీసీ వసతి గృహంలో పాము కాటుతో మృతి చెందిన విద్యార్థి సాయిరాజ్ కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 3 లక్షల ఆర్థిక సహాయాన్ని ఆదివారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ పాము కాటుతో విద్యార్థి మృతి చెందడం బాధాకరమన్నారు. దుర్కి గ్రామంలో బాధిత కుటుంబానికి డబుల్ బెడ్రూం ఇల్లు, విద్యార్థి తల్లికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇచ్చామని పేర్కొన్నారు.

ఇదీ మా బలగం!

ప్రజలు వినోదం కోసం సినిమాలు చూస్తారు.. చాలా చిత్రాలను చూసిన కొద్దిసేపటికే మర్చిపోతుంటారు.. కానీ బలగం మాత్రం ప్రజల మనసును తాకింది. బంధాల విలువను.. తమ బలగం గొప్పదనాన్ని తెలియజెప్పింది. దీంతో ప్రతిచోటా ఆ సినిమా ముచ్చటే వినిపిస్తోంది.. కొందరు నాయకులు దీనిని తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. మీరే మా బలగం అంటూ పోస్టర్లు వేయిస్తూ ప్రజల్లో ఉండటానికి ప్రయత్నిస్తున్నారు. ఊళ్లలో సినిమాను ప్రదర్శించి ప్రజలు మనసు గెలుచుకోవాలని చూస్తున్నారు.



బాణాపూర్‌లో బలగం సినిమా ప్రదర్శనను తిలకిస్తున్న జనం (ఫైల్)



- అంతటా అదే ముచ్చట
- అనుబంధాల గురించి చర్చ
- సినిమా టైటిల్‌తో నేతల ప్రచారం
- సామాజిక మాధ్యమాల్లో వైరల్
- పల్లెల్లో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్న పలువురు

సాక్షి, కామారెడ్డి: దెబ్బతింటున్న కుటుంబ బాంధవ్యాలు ఇతివృత్తంగా ఇటీవల విడుదలైన 'బలగం' సినిమా గురించి అంతటా చర్చ జరుగుతోంది. నలుగురు కలిస్తే చాలు ఆ సినిమా గురించే మాట్లాడుకుంటున్నారు. కుటుంబ కలహాలతో ఏ రకంగా బంధాలు దెబ్బతింటున్నాయనే దానిపై చర్చ నడుస్తోంది. అయితే సమాజానికి బాగా కనెక్ట్ అయిన ఈ సినిమా టైటిల్ ఇప్పుడు రాజకీయ పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులకూ ఉపయోగపడుతోంది. తమ గురించి చెప్పుకోవడానికి.. ప్రత్యర్థులను ఎత్తిపొడవడానికి సినిమా టైటిల్‌ను వాడుకుంటున్నారు. 'నా బలం, బలగం కార్యకర్తలే' అంటూ నేతలు పోస్టర్లు తయారు చేయిస్తున్నారు. తనకు ప్రజలే బలగం అంటూ కొందరు, కార్యకర్తలే బలగం అంటూ మరికొందరు పోస్టర్లు చేయించి, సోషల్ మీడియాలో వైరల్ చేయిస్తున్నారు. అలాగే ప్రత్యర్థులపై విమర్శలు చేయడానికి కూడా సినిమా టైటిల్‌ను వాడుకుంటున్నారు.

ఫలానా పార్టీ నాయకుడికి పెట్టుబడిదారులే బలగం అని, తమ నాయకుడికి పేద ప్రజలే బలగమంటూ పోస్టులు పెడుతున్నారు. రాజకీయ నాయకుల ప్రచారం మూలంగా సినిమాకు మరింత ప్రచారం దక్కుతోంది.

బహిరంగ ప్రదర్శనలపై ఫిర్యాదులు

సినిమాను థియేటర్‌లో కాకుండా బహిరంగంగా ప్రదర్శించడాన్ని డిస్ట్రిబ్యూటర్లు వ్యతిరేకిస్తున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదులు కూడా చేశారు. కామారెడ్డి జిల్లాలో పలు గ్రామాల్లో సినిమాను స్క్రీన్లపై ప్రదర్శించారంటూ పోలీసులకు ఫిర్యాదులు అందడంతో పోలీసులు రంగంలోకి దిగారు. అనుమతి లేకుండా సినిమాలు ప్రదర్శించవద్దని ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది.

ఊరంతా కలిసి..

బలగం సినిమా ఓటీటీలో రిలీజ్ అయిన తర్వాత పల్లె ప్రజలకు ఉచితంగా చూపించడానికి కొందరు నేతలు, ప్రజాప్రతినిధులు ఊరి నడుమ స్క్రీన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. పసివాళ్ల నుంచి మొదలుకొంటే పండు ముదుసలి దాకా గతంలో భాగోతం, నాటకాలు, ఒగ్గు, దాసరుల కథలు చూడడానికి ఎలా వచ్చేవారో ఈ సినిమా చూడడానికి కూడా అలాగే తరలి వస్తున్నారు. సినిమా చూపడం ద్వారా జనాలకు దగ్గర కావడం కోసం కొందరు నాయకులు, ప్రజాప్రతినిధులు సొంత డబ్బులతో ఊళ్లల్లో స్క్రీన్‌లు ఏర్పాటు చేసి ప్రదర్శిస్తున్నారు. సినిమాలో మనిషి చనిపోయినపుడు బయటపడే కుటుంబ కలహాలపై పాట జనాన్ని కదిలిస్తోంది. కంట తడి పెట్టిస్తోంది. ఆ పాట వచ్చినప్పుడు చాలామంది కంటతడి పెడుతున్నారు.

రూల్స్ ఇక్కడ వర్తించవు!

- ఉప సర్పంచ్‌లకు బదులు కార్యదర్శులకు చెక్ పవర్
- భిక్కనూరు మండలంలో విచిత్ర పరిస్థితి
- అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం



స్థానిక సంస్థలను బలోపేతం చేయడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాలను తీసుకువచ్చి పకడ్బందీగా అమలు చేస్తోంది. అయితే భిక్కనూరు మండలంలో మాత్రం ఆ చట్టాలు అమలు కావడం లేదు. అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో ఉప సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయారు.

భిక్కనూరు: గ్రామ పంచాయతీల్లో చెక్ పవర్‌కు సంబంధించి జిల్లా వ్యాప్తంగా ఒక రూల్ ఉంటే భిక్కనూరు మండలంలో మాత్రం అధికారులు అందుకు విరుద్ధంగా అమలు చేస్తున్నారు. గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఏ ఖాతాకైనా రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు జాయింట్ చెక్ పవర్ కల్పిస్తున్నారు. ముఖ్యంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మెటీరియల్ కాంపోనెంట్ కింద చేపట్టే పనులకు చెల్లింపులకు సంబంధించి జిల్లా అంతటా అదేవిధానాన్ని అమలు చేస్తున్నారు. భిక్కనూరు మండలంలో మాత్రం అధికారులు అందుకు విరుద్ధంగా ఉప సర్పంచ్‌కు కాకుండా పంచాయతీ కార్యదర్శికి జాయింట్ చెక్ పవర్ ఇచ్చారు. ఇదేమి అన్యాయం అంటూ ఉప సర్పంచ్‌లు ఎంపీడీవో అనంతరావు దృష్టికి తీసుకెళ్లినా.. మండలంలో గతంలో అమలు చేసిన రూల్స్‌నే ఇప్పుడూ పాటిస్తున్నామని సమాధానం ఇస్తూ చేతులు దులుపుకుంటున్నారని ఉప సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉప సర్పంచ్‌లకు జాయింట్ చెక్ పవర్ కల్పించే విషయమై అధికారులను అడుగుతున్నా నోరు మెదపడం లేదు. మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి గ్రామంలో ఏటా లక్షలాది రూపాయల విలువ చేసే పనులు జరుగుతున్నాయి. పనులు చేసిన వారికి చెల్లింపుల విషయంలో ఉప సర్పంచ్‌లకు బదులు కార్యదర్శులకు జాయింట్ చెక్ పవర్ కట్టబెట్టడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదు. న్యాయం చేయాలని ఎంపీవోకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా స్పందన లేదని ఉప సర్పంచ్‌లు వెల్లడించారు.

చిన్నచూపు తగదు



ఉప సర్పంచ్‌లకు ఉన్న అధికారాలను అధికారులు అమలు చేయకుండా చిన్నచూపు చూడడం తగదు. నాలుగేళ్లుగా అడుగుతున్నా స్పందన లేదు. జిల్లా అధికారులు కల్పించుకొని వెంటనే జాయింట్ చెక్ పవర్ కల్పించాలి.

–బోద నరేశ్, ఉపసర్పంచ్, భిక్కనూరు

నాలుగేళ్లుగా అడుగుతున్నాం



రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్నట్లే మండలంలోనూ ఉప సర్పంచ్‌లకు జాయింట్ చెక్ పవర్ కల్పించాలని నాలుగేళ్లుగా అడుగుతున్నాం. ఏడాదిలో పదవీకాలం పూర్తవుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

–భిక్షపతి, ఉపసర్పంచ్, బస్వాపూర్

బ్యాంకు అధికారులకు టోకరా

- క్యాష్ కౌంటింగ్ మిషన్‌కు మరమ్మతుల పేరుతో బురిడీ
- రూ.50 వేలతో ఉడాయించిన మోసగాడు
- కామారెడ్డి యాక్సిస్ బ్యాంక్‌లో ఘటన



కామారెడ్డి క్రైం: నోట్లు లెక్కించే మిషన్‌కు మరమ్మతులు చేసే టెక్నీషియన్ అంటూ వచ్చిన ఓ వ్యక్తి బ్యాంకు అధికారులను బురిడీ కొట్టించి రూ. 50 వేలతో ఉడాయించాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని విద్యానగర్ యాక్సిస్ బ్యాంక్ శాఖకు శుక్రవారం మధ్యాహ్నం ఓ వ్యక్తి వచ్చి బ్యాంకు క్యాషియర్‌ను కలిశాడు. తాను యాక్సిస్ బ్యాంక్‌కు సంబంధించిన నోట్లు లెక్కించే యంత్రాలకు సర్వీసింగ్ చేస్తానని పేర్కొన్నాడు. బ్యాంకు అధికారులు వివరాలు అడిగిన తర్వాత అతడిని క్యాష్ కౌంటర్ లోపలికి అనుమతి ఇచ్చారు. క్యాష్ కౌంటర్‌లోని ఓ మిషన్‌ను పరిశీలించడానికి రూ.50 వేల నోట్ల కట్టను ఇచ్చారు. మిషన్‌ను పరిశీలించిన అనంతరం ఆ వ్యక్తి మిషన్ నోట్లను సరిగా లెక్కించడం లేదని, మరమ్మతులకు అవసరమైన స్పేర్ పార్ట్స్ కొనుక్కుని వస్తానని చెప్పి మిషన్‌ను తనవెంట తీసుకువెళ్లాడు. రూ. 50 వేల నోట్ల కట్ట అందులోనే ఉన్న విషయాన్ని బ్యాంకు అధికారులు మరిచారు. మిషన్ తీసుకువెళ్లిన వ్యక్తి ఎంతకీ రాకపోవడంతో బ్యాంకు అధికారులు ఆదివారం కామారెడ్డి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాంకు మేనేజర్ ఆదినారాయణ మూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని పట్టణ ఎస్‌హెచ్‌వో నరేష్ తెలిపారు.

బీఆర్‌ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి

- ప్రతిపక్ష నాయకుల మాటలు నమ్మొద్దు
- ఆత్మీయ సమ్మేళనంలో ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి వేముల, ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యే సురేందర్, కలెక్టర్ పాటిల్

గాంధారి: బీఆర్‌ఎస్, సీఎం కేసీఆర్‌లతోనే తెలంగాణ అభివృద్ధి చెందిందని ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందాలంటే బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉండాలన్నారు. ఆదివారం ఆయన జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్‌లతో కలిసి మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే సురేందర్ ఇచ్చిన హామీల మేరకు ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని, ప్రధానంగా గాంధారి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారన్నారు. గాంధారిలో రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి కావస్తున్నాయన్నారు. బుగ్గ గండి నుంచి మొండి సడక్ వరకు సాంకేతిక కారణాలతో నిలిచిన రోడ్డు వెడల్పు పనులకు శంకుస్థాపన చేశామన్నారు. గ్రామంలో కొన్నేళ్లుగా ప్రధాన సమస్యగా ఉన్న గుండమ్మ కాలువ సీసీ రోడ్డు, మురికి కాలువ పనులు పూర్తయ్యాయన్నారు. చేతకాని ప్రతిపక్ష నాయకులు పనికి రాని మాటలు చెబుతారని, ప్రజలు వారి మాటలు నమ్మవద్దని కోరారు. దేశంలో అత్యంత అవినీతిపరుడు ప్రధాని నరేంద్ర మోదీయేనని ఆరోపించారు. దేశాన్ని దోచి అదానీకి అప్పగిస్తున్నాడన్నారు. సీఎం కేసీఆర్‌ను, బీఆర్‌ఎస్ పార్టీని ఎదుర్కొనే దమ్ములేక కేసీఆర్ కూతురు, ఎమ్మెల్సీ కవితమ్మపై అక్రమ కేసులు బనాయించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. బీజేపీ అక్రమ కేసులకు మూల్యం చెల్లించక తప్పదన్నారు.

అభివృద్ధి కోసమే పార్టీ మారా..

వెనకబడి ఉన్న ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీ మారానని ఎమ్మెల్యే సురేందర్ తెలిపారు. అధికార పార్టీలో చేరి సీఎం కేసీఆర్, మంత్రులతో సన్నిహితంగా ఉంటూ నిధులు మంజూరు చేయిస్తున్నానన్నారు. ప్రధానంగా మంత్రి ప్రశాంతన్న దృష్టికి సమస్యలు తీసుకువెళ్తుండడంతో ఆయన వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారని, నియోజకవర్గంలో రోడ్ల వెడల్పు, బీటీ రోడ్లు వేయిస్తున్నారని పేర్కొన్నారు. కార్యకర్తల అండ ఉంటే మరింత అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ దఫేదార్ శోభ, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ శంకర్ నాయక్, ఎంపీపీ రాధా బలరాం నాయక్, సర్పంచ్ సంజీవు, ఏఎంసీ చైర్మన్ సత్యంరావు, సింగిల్ విండో చైర్మన్ సాయికుమార్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు తానాజీరావు తదితరులు పాల్గొన్నారు.

అయ్యాకొడుకుల ఆటలిక సాగవు



మాట్లాడుతున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

- ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు
- మాజీ మంత్రి షబ్బీర్ అలీ

భిక్కనూరు: తండ్రి అబద్ధాల నోటిఫికేషన్లు విడుదల చేస్తుంటే కొడుకేమో ప్రశ్నాపత్రాలను లీక్ చేస్తూ నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నారని మాజీ మంత్రి షబ్బీర్ అలీ విమర్శించారు. అయ్యాకొడుకుల ఆటలిక సాగవన్నారు. ఆదివారం తిప్పాపూర్‌లో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తండ్రి కేసీఆర్ అరచేతిలో వైకుంఠం చూపిస్తుంటే కొడుకు కేటీఆర్ మోచేతికి బెల్లం పెట్టి ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. ఇంకా ఎంత కాలం తండ్రీకొడుకులు ప్రజలను మోసం చేస్తారని ప్రశ్నించారు. మన రాష్ట్రంలో తొమ్మిదేండ్లలో 12 వేల మంది ఆత్మహత్యలు చేసుకుంటే కనీసం ఒక్కరినీ పలుకరించని సీఎం కేసీఆర్.. ఇతర రాష్ట్రాల రైతులు ఆత్మహత్య చేసుకుంటే వారికి ఎక్స్‌గ్రేషియా ఇవ్వడం ఎంతవరకు సమంజసమన్నారు. కాంగ్రెస్ పార్టీకి బలం, బలగం కార్యకర్తలేనన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు ప్రతిరోజు గంట పాటు పార్టీ కోసం శ్రమించాలని, బీఆర్‌ఎస్ నేతలు చేస్తున్న అన్యాయాలను ప్రజలకు వివరించాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీలను భూస్థాపితం చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, డీసీసీబీ మాజీ చైర్మన్ ఎడ్ల రాజిరెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి, మండలాధ్యక్షుడు భీంరెడ్డి, నాయకులు లింగారెడ్డి, బల్యాల సుదర్శన్, ధర్మయ్య, సిద్ద రాములు, అంకంరాజు, దయాకర్‌రెడ్డి, ద్యాగల కిరణ్, కోటని స్వామి, సిద్దగౌడ్, గజ్జె సురేశ్, దుంపల మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి ఎస్సెస్సీ పరీక్షలు

- ఏర్పాట్లు చేసిన అధికారులు

కామారెడ్డి టౌన్: ఎస్సెస్సీ వార్షిక పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 13వ తేదీ వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. జిల్లాలో పదోతరగతి పరీక్షలకు 11,899 మంది హాజరు కానున్నారు. ఇందులో బాలురు 5,902 మంది, బాలికలు 5,997 మంది ఉన్నారు. వీరి కోసం 63 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఇందులో 'ఏ' కేటగిరీలో 17, బీ కేటగిరీలో 31, సీ కేటగిరీలో 15 సెంటర్లున్నాయి. 63 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, 63 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, ఐదుగురు రూట్ ఆఫీసర్లు, 22 మంది కస్టోడియన్స్, 22 మంది జాయింట్ కస్టోడియన్స్, సీ కేటగిరీ సెంటర్ల కోసం అదనంగా 15 మంది కస్టోడియన్స్, 662 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు డీఈవో తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఏఎన్ఎం అందుబాటులో ఉంటారన్నారు. విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పరీక్ష రాసే విద్యార్థులకు ఆర్టీసీ ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. విద్యార్థులు హాల్ టికెట్ చూపి బస్సులో ఉచితంగా ప్రయాణించవచ్చు.

'రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైంది'

కామారెడ్డి టౌన్: తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు నళినీదేవి ఆరోపించారు. ఆదివారం ఆమె జిల్లా కేంద్రంలో పర్యటించారు. పట్టణంలోని ప్రముఖ వైద్యురాలిని కలిసి మాట్లాడారు. బీజేపీ మహిళా నాయకురాలు విశ్వనాథుల అనిత నివాసంతో భోజనం చేశారు. చిన్నమల్లారెడ్డి గ్రామంలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లిక్కర్ స్కాంలో ఇరుక్కున్న ఎమ్మెల్సీ కవితను కాపాడడం కోసం రాష్ట్ర క్యాబినెట్ మంత్రులు ఢిల్లీకి వెళ్లడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీతో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, సమస్యలు పరిష్కారానికి నోచుకోక రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అవినీతి రహిత పాలన కావాలంటే బీజేపీ అధికారంలోకి రావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్న ధీమాను వ్యక్తం చేశారు. కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి సరోజ, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శులు హారిక, యాదమ్మ, నాయకులు కంది బాలమణి, హారిక, సంధ్య, అనిత, శ్యామల, లక్ష్మి, సుశీల తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో డాక్టర్ శ్రావణికరెడ్డితో మాట్లాడుతున్న నళినీదేవి

క్లుప్తంగా

5 నుంచి విశ్వశాంతి మహాయాగం



నిజామాబాద్ సిటీ : జిల్లా కేంద్రంలో ఈ నెల 5 నుంచి 79వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవం జరుగనుంది. జిల్లా కేంద్రంలోని మారుతినగర్ కలెక్టరేట్ బైపాస్‌రోడ్డు హనుమాన్ ఆలయం వెనుక ఖాళీ స్థలంలో దీనికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామి ఆధ్వర్యంలో 16రోజుల పాటు ఈ మహోత్సవాలు జరుగనున్నాయి. అయుత చండీ, అతిరుద్రం, శ్రీ సీతారామ సామ్రాజ్య పట్టాభిషేకాలు నిర్వహించనున్నారు. యాగాలు చేయనున్నారు. దీనికిగాను ప్రత్యేకంగా వేసిన యాగశాలలో యజ్ఞకుండాలను ఏర్పాటు చేశారు.

అందరికీ ఉచితం..



విశ్వశాంతి కోసం భక్తులు కృషి చేయాలి. తాము నిర్వహించే ఈ యాగంలో పాల్గొని పాడి పంటలు, అభివృద్ధి కోసం కృషిచేయాలి. ప్రతిరోజు ఉదయం 6 నుంచి 7 గంటల వరకు ధ్యానం, ఉపనిషత్ భాష్యం, ఉదయం 11 గంటలకు మద్భగవద్గీత, భాగవతంపై స్వామిజీ అమృత భాష్యాలు ఉంటాయి. ఈ యాగంలో, పూజల్లో, హోమంలో, అభిషేక, అర్చనల్లో అందరూ ఉచితంగా పాల్గొనవచ్చు. భక్తులకు ప్రతిరోజు ఉదయం, రాత్రికి అల్పాహారం, మధ్యాహ్నం అన్నదానం ఉంటుంది.

–కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీ

జిల్లా సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభం



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): మండలంలోని సుద్దపల్లి శివారులోగల సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల క్రీడామైదానంలో ఆదివారం జిల్లా మినీ సబ్‌- జూనియర్ (అండర్‌-10) సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌ను జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యక్షుడు జైడి రాజ్‌కుమార్ ప్రారంభించారు. ముందుగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని, మాట్లాడారు. క్రీడాకారులు చిన్న వయసులోనే జిల్లా సాఫ్ట్‌బాల్ క్రీడల్లో పాల్గొనడం సంతోషకరమైన విషయమన్నారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొని, దేశానికి, రాష్ట్రానికి పేరు తేవాలని ఆకాంక్షించారు. స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ నీరజ రెడ్డి, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, మర్కంటి గంగా మోహన్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి బొజ్జ మల్లేష్‌గౌడ్, ప్రిన్సిపల్ గోదావరి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



నిజామాబాద్‌నాగారం: నగరంలోని వినాయక్ నగర్‌లోని అభ్యాస స్కూల్‌లో ఆదివారం జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్‌–17 బాలబాలికల విభాగంలో ఎంపికలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. బాలురలో రూపేంద్ర దత్త అంకిత్, అభిరామ్‌లు, బాలికల్లో నాగజోష్నిక, రోషిణిలు ఎంపికయ్యారు. ఈసందర్భంగా ఎంపికైన క్రీడాకారులను ఎన్‌వైకే కోఆర్డినేటర్ బెల్లాల్ శైలీ అభినందించారు. చెస్ అసోసియేషన్ కార్యదర్శి రమేష్, ఆర్బిటర్ బ్రహ్మానందం, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్

- దోమకొండలో నాడు ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఆతిథ్యమిచ్చిన భవనం
- నేడు కళావిహీనంగా మారిన వైనం



దోమకొండలో శిథిలావస్థకు చేరిన ఆర్‌అండ్‌బీ అతిథిగృహం

దోమకొండ: గతంలో కళకళలాడిన దోమకొండ ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్ నేడు శిథిలావస్థకు చేరుకుని కళావిహీనంగా మారింది. దోమకొండకు వచ్చే ఎమ్మెల్యేలు, ఎంపీలు, రాష్ట్ర మంత్రులు, కేంద్ర మంత్రులు, ఇతర వివిధ రంగాల ప్రముఖులు ఇక్కడికి వచ్చినా ముందుగా ఆర్‌అండ్‌బీ భవనానికి వచ్చేవారు. అక్కడ కొద్దిసేపు సేదతీరి అనంతరం కార్యక్రమాలను నిర్వహించేవారు. అనాడు దోమకొండ తాలుకా కేంద్రంగా ఉమ్మడి భిక్కనూరు, మాచారెడ్డి, దోమకొండ మండలాలకు కలిపి దీనిని నిర్మించారు. ప్రభుత్వ కార్యకలాపాలకు దీనిని వేదికగా పనులు చేసేవారు.

1981లో శంకుస్థాపన..

దోమకొండలో 17–10–1981లో నాటి ప్రభుత్వం ఆర్‌అండ్‌బీ అతిథిగృహానికి శంకుస్థాపన చేశారు. 13–09–1986లో నిజామాబాద్ కలెక్టర్ ఆశమూర్తి ప్రారంభించారు. నాటి కేంద్ర మంత్రులు పీవీ సంగ్మాతో పాటు, ఎంపీలు బాలాగౌడ్, మాణిక్‌రెడ్డి, బాగారెడ్డి, పలువురు రాష్ట్ర మంత్రులు దోమకొండ ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో బసచేశారు. యడారం డీప్లోరైడ్ నిర్మాణ సమయంలో అప్పటి రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావ్, మండవ వెంకటేశ్వర్‌రావ్, పోచారం శ్రీనివాస్‌రెడ్డితో పాటు మంత్రులు దానం నాగేందర్, శ్రీధర్‌బాబు, షబ్బీర్‌అలీ వంటి మంత్రులు, ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ కూడా ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో బసచేశారు. ఇటీవల ఆర్‌అండ్‌బీ అతిథిగృహం స్థలం కబ్జాకు గురైనట్లు ఆరోపణలు రాగా.. తిరిగి అతిథిగృహం వార్తల్లోకి ఎక్కింది. పంచాయతీ, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారులు సర్వే చేసి హద్దులను వేశారు. శిథిలావస్థకు చేరుకున్న ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌కు అధికారులు మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

భవనాన్ని పునరుద్ధరించాలి..



దోమకొండ ఆర్‌అండ్‌బీ అతిథిగృహం 1986లో ప్రారంభించారు. ఇక్కడ బీడీ కాలనీ ఏర్పాటు కోసం వచ్చిన కేంద్ర మంత్రి పీఏ సంగ్మాతో పాటు, నాటి ఎంపీలు బాలాగౌడ్, మాణిక్‌రెడ్డి, బాగారెడ్డి, ఎలాంటి కార్యక్రమాలకు వచ్చిన అతిథిగృహంలో ఉండేవారు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన భవనానికి అధికారులు మరమ్మతులు చేపట్టాలి.

–తీగల తిర్మల్‌గౌడ్, జెడ్పీటీసీ, దోమకొండ

ప్రతిపాదనలు పంపాం..



దోమకొండలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్ దాదాపు 40 ఏళ్ల క్రితం నిర్మించారు. ఇది ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. మరమ్మత్తుల కోసం ప్రతిపాదనలు పంపించాం. అవసరమైతే కొత్త భవనం నిర్మించాలని కూడా ప్రతిపాదనలు ఉన్నాయి. దోమకొండకు గడికోట ఉండటం వల్ల చాలా మంది ప్రముఖులు వస్తుంటారు.

–శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ డీఈ, కామారెడ్డి

పంచాయతీల్లో పదవులు ఖాళీ!



- జిల్లాలో14 సర్పంచ్, 122 వార్డు సభ్యుల ఖాళీల గుర్తింపు
- నాలుగేళ్లుగా నిర్వహించని ఉపఎన్నికలు

నాగిరెడ్డిపేట: జిల్లాలోని పలు గ్రామ పంచాయతీల్లో ఏర్పడ్డ ఖాళీలకు ఉపఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల సుమారు నాలుగేళ్లుగా పదవులు ఖాళీగా ఉన్నాయి. ఎన్నికల సంఘం ఇదివరకే గ్రామ పంచాయతీలలో ఖాళీగా ఉన్న స్థానాలను గుర్తించినప్పటికీ ఎన్నికల నిర్వహణకు ప్రకటన విడుదల చేయలేదు. మరోవైపు ప్రభుత్వం సైతం ఉపఎన్నికలపై దృష్టి పెట్టకపోవడంతో పలు గ్రామాల్లో సర్పంచ్, వార్డుసభ్యుల స్థానాలు భర్తీకావడం లేదు. పంచాయతీ పాలకవర్గ సభ్యుల గడువు మరో ఏడాదిలోపు పూర్తికానుంది. ఈలోగా శాసనసభ ఎన్నికలు సైతం వచ్చే అవకాశాలు లేకపోలేదు. ఈ క్రమంలో స్థానిక సంస్థలకు సంబంధించి ఉపఎన్నికలపై సందిగ్ధం నెలకొంది.

ఖాళీలకు కారణాలెన్నో..

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నూతన పంచాయతీరాజ్ చట్టం–2018 ప్రకారం గ్రామ పంచాయతీలకు 2019లో సాధారణ ఎన్నికలు నిర్వహించింది. ఎన్నికల అనంతరం బాధ్యతలు చేపట్టిన సర్పంచ్‌లు, వార్డుసభ్యులు, ఎంపీటీసీల్లో కొందరు మరణించగా, మరికొంత మంది రాజకీయ, వ్యక్తిగత కారణాలతో రాజీనామ చేశారు. ఇంకొంతమందిపై ఎన్నికల సంఘం అనర్హత వేటు వేసింది. ఇలా వివిధ కారణాలతో జిల్లావ్యాప్తంగా 14 సర్పంచ్ స్థానాలు, 122 వార్డు స్థానాలు ఖాళీగా ఉన్నట్లు ఇటీవల అధికారులు గుర్తించారు.

జిల్లాలో ఖాళీగా ఉన్న సర్పంచ్, వార్డుస్థానాలకు ఎన్నికలు నిర్వహించడానికి గతేడాది అధికారులు రెండు పర్యయాలు సన్నాహాలు చేశారు. ఈక్రమంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ జాబితాలను సిద్ధంచేసి గ్రామ పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాలలో ప్రచురణ సైతం చేశారు. కానీ తర్వాతికాలంలో ఏర్పడ్డ పరిస్థితుల కారణంగా ఎన్నికలను నిర్వహించలేదు. దీంతో ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇచ్చేవరకు గ్రామ పంచాయతీలలో ఖాళీగా ఉన్న సర్పంచ్, వార్డుసభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించలేమని అధికారులు పేర్కొంటున్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో జరిగిన నాలుగు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతిచెందారు. మోపాల్ మండలం నర్సింగ్‌పల్లిలో రెండు బైక్‌లు ఎదురెదురుగా వచ్చి ఢీకొనగా ఒకరు మృతిచెందారు. మరొకరికి గాయాలయ్యాయి. అలాగే నిజామాబాద్‌లో కంఠేశ్వర్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద రెండు బైక్‌లు యూటర్న్ తీసుకుంటుండగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒకరు మృతిచెందారు. డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లి శివారులోని హైవేపై ఓ బైక్‌ను డీసీఎం వెనుక నుంచి వచ్చి ఢీకొట్టడంతో ఒకరు మృత్యువాత పడ్డారు. పిట్లం మండలంలో కారు–బైక్ ఢీకొనగా ఒకరు అక్కడికక్కడే మృతిచెందారు.



నవీన్‌కుమార్ (ఫైల్)

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని నర్సింగ్‌పల్లిలో ఆదివారం సాయంత్రం ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని ఒకరు మృతిచెందగా.. మరొకరికి గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. నగరంలోని కంఠేశ్వర్‌కు చెందిన నవీన్‌కుమార్ (38) పండుగ నిమిత్తం ఇటీవల ముదక్‌పల్లిలోని సూదులమ్మ వద్దకు కుటుంబసభ్యులతో వచ్చాడు. ఆదివారం ఒక్కడే బైక్‌పై కంఠేశ్వర్‌కు బయలుదేరాడు. బాడ్సికి చెందిన కటికె శంకర్ తన మనవరాలితో కలిసి టీవీఎస్ ఎక్సల్‌పై మోపాల్ నుంచి వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న నవీన్‌కుమార్ ఢీకొన్నారు. ప్రమాదంలో నవీన్‌కుమార్ తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించగా, మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శంకర్‌కు ఎడమ కాలు విరిగింది. మృతుడికి భార్య ప్రణవి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉంది. నవీన్‌కుమార్ గల్ఫ్ నుంచి ఆరునెలల క్రితం వచ్చాడు. వేరే దేశానికి వెళ్లేందుకు ప్రయత్నాలు జరుతున్న సమయంలోనే మృతిచెందడంతో కుటుంబసభ్యులు, బంధుమిత్రులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ విషయమై పోలీసులను అడుగగా, ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

నిజామాబాద్ నగరంలో..

ఖలీల్‌వాడి: నగరంలోని కంఠేశ్వర్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద రెండు బైక్‌లు ఢీకొని ఒకరు మృతి చెందినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. వివరాలు ఇలా.. నగరానికి చెందిన తోట గిరిధర్ రావు శనివారం రాత్రి రైల్వే కామన్ వైపు వెళుతుండగా.. బేకర్స్ వ్యాలీ వద్ద యూటర్న్ తీసుకుంటున్నాడు. ఇదే సమయంలో ఎలక్ట్రిక్ బైక్‌పై వెళుతున్న మటం పవన్ కుమార్ యూటర్న్ తీసుకోవడంతో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈప్రమాదంలో గిరిధర్‌రావు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించగా.. మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. పవన్‌కుమార్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు త్రీటౌన్ ఎస్సై శ్రవణ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. శవాన్ని పోస్టుమార్టరం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.

డిచ్‌పల్లి మండలంలో..

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మెంట్రాజ్‌పల్లి శివారులో 44వ నెంబరు జాతీయ రహదారిపై వెళుతున్న బైక్‌ను డీసీఎం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందారు. ఎస్సై గణేష్ తెలిపిన వివరాలు ఇలా.. ఆర్మూర్ మండలం పిప్రి గ్రామానికి చెందిన సలిగంటి రాజు(32) ఆదివారం ఉదయం తన పాపను తీసుకుని ధర్పల్లి మండలం లోలం గ్రామంలోని అత్తగారింటికి వెళ్లాడు. పాపను అక్కడే దింపి మధ్యాహ్నం తిరిగి పిప్రికి తన బైక్‌పై బయలుదేరాడు. బైక్ మెంట్రాజ్‌పల్లి శివారులోకి రాగానే వెనుక నుంచి అతివేగంగా వచ్చిన డీసీఎం ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న రాజు ఎగిరిపడి రోడ్డుమీద పడటంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. మృతుడి భార్య మీనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



రాజు మృతదేహం

పిట్లం మండలంలో..

పిట్లం(జుక్కల్): మండలంలోని బ్రాహ్మణపల్లి గేట్ వద్ద పిట్లం – బాన్సువాడ రహదారిపై ఆదివారం రాత్రి కారు, బైక్ ఢీకొనగా ఒకరు మృతిచెందారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. పిట్లం మండలం అన్నారం గ్రామానికి చెందిన లక్ష్మన్ (28) బైక్‌పై బాన్సువాడ నుంచి అన్నారం గ్రామానికి వస్తుండగా.. బ్రాహ్మణపల్లి గేట్ వద్ద పిట్లం – బాన్సువాడ రహదారిపై ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈప్రమాదంలో బైక్‌పై ఉన్న లక్ష్మన్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఘటన స్థలంలోనే మృతి చెందాడు. కారు డ్రైవర్ పారిపోయినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న పిట్లం పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

గ్రామాల్లో ‘బలగం’ ప్రదర్శన

- ప్రొజెక్టర్లు, ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు
- చిత్రాన్ని ఆసక్తిగా తిలకిస్తున్న ప్రజలు



బాల్కొండ మండలం జలాల్‌పూర్‌లో బలగం చిత్రాన్ని తిలకిస్తున్న గ్రామస్తులు (ఫైల్)

బాల్కొండ: తెలంగాణ యాసలో, కుటుంబ కథ నేపథ్యంతో తెరకెక్కిన బలగం చిత్రాన్ని ప్రస్తుతం పల్లెల్లో ప్రొజెక్టర్లు, ఎల్‌ఈడీ స్క్రీన్‌లపై ప్రదర్శిస్తున్నారు. నియోజకవర్గంలో కమ్మర్‌పల్లి మండలం హసాకొత్తూర్‌లో మొదటిసారి చిత్రాన్ని ప్రదర్శించారు. అక్కడి నుంచి ప్రతి రోజు ఏదో ఒక ఊర్లో చిత్రాన్ని ప్రదర్శిస్తున్నారు. బాల్కొండ మండలంలో జలాల్‌పూర్, బాల్కొండ, నాగాపూర్ గ్రామాల్లో, ముప్కాల్ మండల కేంద్రంలో మండలంలోని రెంజర్ల, వేంపల్లిలో, వేల్పూర్ మండలం పడగల్, మోర్తాడ్ మండలం పాలెంలో, ఏర్గట్ల మండల కేంద్రంలో ఇదివరకే చిత్ర ప్రదర్శన చేపట్టారు. గతంలో పల్లెల్లో బుర్ర కథలు, ఒగ్గు కథలు ప్రదర్శనలు నిర్వహించగా.. గ్రామస్తులు వాటిని చూడటానికి చాపలు పట్టుకుని వెళ్లేవారు. ప్రస్తుతం బలగం చిత్ర ప్రదర్శనలకు సైతం ప్రజలు అలా వెళ్లడంతో నాటి రోజులను గుర్తుకు తెస్తున్నాయంటున్నారు.

సినిమా బాగుంది..



బలగం సిన్మాలో ఇంట్లో పెద్ద దిక్కు చచ్చిపోతే ఎలా ఉంటాదో కళ్లకు కట్టినట్లు చూపించారు. సిన్మా చూసినంత సేపు నన్ను నేను మరిచిపోయాను. సిన్మా బాగుంది. చిత్రాన్ని ఊళ్లో చూపెట్టడం ఆనందంగా ఉంది.

– నీరడి గంగారాం, జలాల్‌పూర్

బంధం విలువ తెలిపిండ్రు..



బలగం సిన్మాలో అన్న, తమ్ముడు, అయ్యా, అవ్వ ఇలాంటి బంధాలను గురించి చక్కగా చూపించారు. ఎంత మంది బలగం ఉన్నా.. పోయేటప్పుడు ఎవరు వెంట రారు. ఉన్నన్ని దినాలు అందరితో మంచిగా ఉండాలని సెప్పడం బాగుంది. సిన్మా చూసి కన్నీళ్లు పెట్టుకున్నాను.

– ఎర్ర గంగారాం, జలాల్‌పూర్

ఇలాంటి సినిమాను చూస్తాననుకోలేదు..



ఇప్పటి రోజుల్లో ఇలాంటి సినిమాను చూస్తాననుకోలేదు. గతంలో ఊళ్లలో చనిపోతే బుర్ర కథ చెప్పించేవాళ్లం అంటు మా పెద్దలు సెప్పగా విన్నాను. కానీ సినిమాలో చూసాను. ఆ కథ వింటుంటే కన్నీళ్లు ఆగలేవు. సినిమాను గ్రామస్తులందరితో కలిసి చూడటం ఆనందంగా ఉంది.

– అనిల్, జలాల్‌పూర్

అపూర్వ ఆత్మీయ సమ్మేళనం



నిజామాబాద్ నగర కేంద్రంలోని నిర్మల హృదయ పాఠశాల 1998 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇరవైఐదు ఏళ్ల కిత్రం ఒకే పాఠశాలలో చదువుకుని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు సమ్మేళనానికి తరలి వచ్చారు. దీంతో వారు ఒకొరినొకరు ఆత్మీయంగా పలుకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులు అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సమ్మేళనానికి ఆహ్వానించి సన్మానించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ధనలక్ష్మి, సౌజన్య, కళ్యాణి, రమ్య, ప్రణతి, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

బతికుండగానే పోస్టుమార్టం గదికి..

- అంబులెన్స్ టెక్నీషియన్, గాంధీ ఆస్పత్రి సిబ్బంది నిర్వాకం
- గమనించిన జీజీహెచ్ పోస్టుమార్టం గది వార్డ్‌బాయ్స్
- ప్రస్తుతం చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు



చికిత్స పొందుతున్న అబ్దుల్ గఫార్

నిజామాబాద్ సిటీ: బతికుండగానే ఓ వ్యక్తిని పోస్టుమార్టం గదికి తరలించిన సంఘటన నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ రూరల్ మండలం తిర్మన్‌పల్లి గ్రామానికి చెందిన అబ్దుల్ గఫార్, హైమద్, సద్దాం శుక్రవారం సాయంత్రం మద్యం సేవించి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా తిర్మన్‌పల్లిలో బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ ఘటనలో గఫార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. హైమద్ ఓ మోస్తరుగా, సద్దాం స్వల్పంగా గాయపడ్డారు. వెంటనే కుటుంబ సభ్యులు గఫార్, హైమద్‌లను నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా.. గఫార్‌ను పరీక్షించిన వైద్యులు అతడి మెదడులో రక్తం గడ్డకడుతోందని, సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో అతడిని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అంబులెన్స్‌లోనుంచి గఫార్‌ను దింపడానికి వచ్చిన వార్డుబాయ్స్ గఫార్ పరిస్థితిని చూసి ఇతడు చనిపోయే స్థితిలో ఉన్నాడని, ఆక్సిజన్ పైప్ తీసేస్తే మరణిస్తాడని, అనవసరంగా ఇక్కడి దాకా తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఈ మాటలకు గఫార్ భార్య ఆందోళనకు గురై ఇక గఫార్ చనిపోయినట్లుగానే భావించింది. పోస్టుమార్టం కోసం గాంధీలో అయితే ఆలస్యమవుతుందని భావించి శనివారం నేరుగా నిజామాబాద్ జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. వైద్యులను సంప్రదించకుండానే నేరుగా పోస్టుమార్టం గది వద్దకు తీసుకెళ్లారు. అనంతరం నిజామాబాద్ రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వగా ఆదివారం ఉదయం వచ్చి పంచనామా చేస్తామని, అప్పటివరకు మృతదేహాన్ని పోస్టుమార్టం గదిలో ఉంచాలని చెప్పడంతో గఫార్‌ను గదికి తరలించారు. అక్కడ వార్డుబాయ్స్ గఫార్ నోట్లోనుంచి ఆక్సిజన్ పైప్‌ను తొలగిస్తుండగా అతడు ఒక్కసారిగా దమ్ముతీశాడు. కంగారు పడిన వార్డుబాయ్స్ విషయాన్ని గఫార్ కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారు వెంటనే జీజీహెచ్ వైద్యులతో మాట్లాడారు. వైద్యులు గఫార్‌ను ఐసీయూకు తరలించారు. అయితే గఫార్‌కు చికిత్స చేసేందుకు సరైన పరికరాలు ఇక్కడ లేవని, గాంధీకే తీసుకెళ్లాలని వైద్యులు సూచించడంతో ఆదివారం మధ్యాహ్నం తిరిగి గాంధీకి తీసుకెళ్లారు. గఫార్‌ను పోస్టుమార్టం గదిలో వార్డ్‌బాయ్స్ పరిశీలించి ఉండకపోతే అతడు ప్రాణాలు కోల్పోయేవాడు.

పల్స్ కూడా చూడకుండానే..

విషమ పరిస్థితిలో ఉన్న పేషంట్లను ఆక్సిజన్ సౌకర్యం ఉన్న అంబులెన్స్‌లో తరలిస్తారు. వెంట టెక్నీషియన్ కూడా ఉంటారు. అయితే గఫార్‌ను తీసుకెళ్లిన అంబులెన్స్ టెక్నీషియన్ కనీసం పల్స్ చెక్ చేయకుండానే పోస్టుమార్టం గదికి తీసుకెళ్లడం విస్మయానికి గురిచేస్తోంది. ఈ విషయమై గఫార్ కుటుంబ సభ్యులు టెక్నీషియన్‌ను ప్రశ్నిస్తే ఆక్సిజన్ పైప్ తీసివేస్తే అతడు చనిపోతాడని గాంధీ ఆస్పత్రి వైద్య సిబ్బంది, కుటుంబ సభ్యులు చెప్పడంతో తాను పోస్టుమార్టం గదికి తీసుకెళ్లానని చెప్పాడు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి



వివరాలు సేకరిస్తున్న ఏఎస్సై దయాళ్‌సింగ్

మోపాల్(నిజామాబాద్ రూరల్): మండలంలోని సిర్‌పూర్ గ్రామశివారు లోగల కాళేశ్వరం కెనాల్‌లో శనివారం సాయంత్రం చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. ఏఎస్సై దయాళ్ సింగ్ ఆదివారం తెలిపిన వివరాలు ఇలా.. జక్రాన్‌పల్లి మండలం పుప్పాలపల్లికి చెందిన రేవల్లి గంగాధర్(35) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. రెండ్రోజుల క్రితం తన అత్తగారిల్లు మోపాల్‌కు వచ్చాడు. శనివారం సాయంత్రం అతడు మోపాల్‌కు చెందిన మిర్యాల లక్ష్మణ్, తెనుగు వినోద్‌తో కలిసి సిర్‌పూర్ శివారులో నూతనంగా నిర్మించిన కెనాల్ వద్దకు చేపల వేటకు వెళ్లారు. చేపలు పట్టేందుకు వెళ్లి శరీరానికి వల చుట్టుకుని ఊపిరాడక మృతిచెందాడు. కానీ గంగాధర్ మృతి విషయంలో మిగతా ఇద్దరిపై కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లాకేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు



బోల్తా పడిన జీపీ ట్రాక్టర్

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని శ్రీరాంనగర్ తండాకు చెందిన గ్రామపంచాయతీ ట్రాక్టర్, ట్యాంకర్ ఆదివారం మంచిప్పలో బోల్తాపడింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. జీపీ ట్రాక్టర్ డ్రైవర్ ట్యాంకర్‌లో నీటిని నింపుకుని మొక్కలకు పట్టేందుకు వస్తున్నాడు. మంచిప్ప రైతువేదిక మూలమలుపు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో డ్రైవర్ సాయిలుకు గాయాలయ్యాయి. స్థానికులు బాధితుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

వేల్పూర్: మండలంలోని అంక్సాపూర్ సమీపంలో శనివారం రాత్రి బైక్‌పై వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తి బైక్ అదుపుతప్పి గాయాలపాలయ్యాడని ఎస్సై వినయ్‌కుమార్ ఆదివారం తెలిపారు. మెట్‌పల్లి వైపు నుంచి ఆర్మూర్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తి(35) బైక్ అదుపుతప్పడంతో ప్రమాదానికి గురైనట్లు తెలిపారు. స్థానికులు అతడిని అంబులెన్సులో నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. గాయపడ్డ వ్యక్తి డిచ్‌పల్లి మండలానికి చెందిన వ్యక్తిగా తెలిసిందన్నారు. ఎవరైన వ్యక్తుల ఆచూకీ లేనట్లయితే వేల్పూర్ ఎస్సై 8712659862 నంబరుకు ఫోన్ చేయాలని తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో ఒకరికి..

మాక్లూర్: మండలంలోని అడవి మామిడిపల్లి వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు చేస్తుండగా ఆదివారం ఓ కూలి విద్యుత్‌షాక్ తగిలి తీవ్రంగా గాయాపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. అడవి మామిడిపల్లి వద్ద మూడేళ్లుగా రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు కొనసాగుతున్నాయి. కాగా పనుల్లో భాగంగా సందీప్ అనే కూలీ బ్రిడ్జి పైకెక్కి పనులు చేస్తుండగా విద్యుత్ వైర్లు తాకడంతో షాక్‌కు గురయ్యాడు. దీంతో అతడికి తీవ్రగాయాలు అయ్యాయి. బాధితుడిని సంబంధిత కాంట్రాక్టర్ చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించాడు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



కామారెడ్డి క్రైం: కామారెడ్డిలోని గురు రాఘవేంద్ర కాలనీలో ఓ తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. నర్సన్నపల్లికి చెందిన ద్యాప నవీన్ గత 9నెలలుగా కుటుంబంతో కలిసి గురు రాఘవేంద్ర కాలనీలో ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఈనెల 1న కుటుంబంతో కలిసి సంగారెడ్డికి వెళ్లారు. శనివారం రాత్రి 11.30 గంటల ప్రాంతంలో ఇంటికి తిరిగివచ్చి చూసేసరికి ఇంటో చోరీ జరిగినట్లు గుర్తించారు. ఇంట్లోని బీరువా, సామాన్లన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో దాచి ఉంచిన 1.6 తులాల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, పూజ సామగ్రి చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దేవునిపల్లి ఎస్సై ప్రసాద్ ఆదివారం ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.